క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

సబ్బవరం: విద్యార్థులు ప్రతిరోజు యోగాసనాలు వేయడం ద్వారా రోజంతా ఉత్సాహంగా ఉండటంతోపాటు వారిలో మేధోశక్తి పెరుగుతుందని గ్రంథాలయ అధికారి వి.శిరీష అన్నారు. సబ్బవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా రిసోర్స్ పర్సన్ రత్నకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులచే బుధవారం దినపత్రికలు చదివించి, సూర్యనమస్కారాలు వేయించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

దేవీపురంలో అక్షయ తృతీయ వేడుకలు


మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న మహిళలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో మహాలక్ష్మి అమ్మవారికి అక్షయ తృతీయ వేడుకలను పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీయంత్ర మహామేరు ఈశాన్య భాగంలో కొలువైన అమ్మవారికి ఉదయం నుంచి హాజరైన భక్తుల సమక్షంలో సుగంధ జల, క్షీర, పంచామృతాభిషేకాలతో అభిషేకించారు. అనంతరం ముగ్గురమ్మల ప్రాంగణంలో మహాలక్ష్మి సహస్రనామావళి సహిత కుంకుమార్చన జరిపారు. సమాంతరంగా శ్రీవిద్యారణ్య సంపుటిత శ్రీసూక్త శ్రీమహాలక్ష్మిమ హోమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి సంధ్యాహారతి ఘనంగా జరిగింది.

సిమెంట్ బెంచీల వితరణ


బెంచీలను అందిస్తున్న విశ్వనాథం దంపతులు

పరవాడ: స్థానిక బ్రాహ్మణి ముత్యాలమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన చింతల విశ్వనాథం దంపతులు రెండు సిమెంటు బెంచీలను బుధవారం అందించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. విశ్వనాథం దంపతులకు ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం, అంతకాపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ బుధవారం తెలిపారు. దీంతో ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, అసకపల్లి, ఇరువాడ, గొటివాడ, ఆరిపాక, అంతకాపల్లి, గుల్లేపల్లి, మొగలిపురం, మల్లునాయుడుపాలెం, అయ్యన్నపాలెం, బంగారమ్మపాలెం, నాయనమ్మపాలెం, ఎల్లుప్పి, వంగలి, గాలిభీమవరం, అడ్డూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాల్సిందిగా కోరారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


శివకుమార్

పెందుర్తి: వేపగుంట సమీపంలోని వెంకటసాయినగర్‌కు చెందిన చెవ్వేటి శివకుమార్(37) అదృశ్యంపై కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాలనీకి చెందిన శివకుమార్ ఈ నెల 27న తన భార్య కుమారి, కుమారుడిని బైక్‌పై వేపగుంటలోని చర్చి దగ్గర దించాడు. అక్కడి నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఎంతకీ తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్పందించలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో భార్య కుమారి పోలీసులను ఆశ్రయించింది. సీఐ కె.వి.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ బి.అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి సమీపంలో ఉన్న సున్నం బట్టీల వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. స్థానికుల సమాచారంతో సబ్బవరం ఎస్‌ఐ దివ్య ఘటనా స్థలికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని ఒంటిపై టవల్ మాత్రమే చుట్టుకుని ఉంది. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేర్చుకుందాం రండి!

వేసవి శిక్షణతో.. విజ్ఞానం, వినోదం

ఇప్పుడంతా డిజిటల్ యుగం. పిల్లల చేతులు పుస్తకాల స్పర్శను అనుభూతి చెందక ముందే ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు అలవాటైపోతున్నాయి. టీవీలు, మొబైల్ ఫోన్లతో గడిపే పిల్లల గురించైతే చెప్పనక్కర్లేదు. ఇది పిల్లల ఆరోగ్యంతో పాటు, మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నా.. చాలా మంది తల్లిదండ్రులు ఏం చేయలేని స్థితి. వేసవి సెలవుల్లో ఇళ్ల వద్ద పిల్లలు మరింతగా వీటికి బానిసలు కాకుండా ఉండేందుకు గ్రంథాలయాలు తమ వంతు కృషి చేస్తున్నాయి. కొత్త కొత్త అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నాయి. పెందుర్తి శాఖా గ్రంథాలయంలో ఇప్పటికే వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది.


పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న యువత



- గ్రంథాలయాలు వేదికగా వేసవి శిక్షణ తరగతులు
- ఉత్సాహంగా పాల్గొంటున్న చిన్నారులు
- పెందుర్తి శాఖా గ్రంథాలయంలో శిక్షణకు 30–35 మంది పిల్లల హాజరు
- అందుబాటులో 8,071 పుస్తకాలు, వార్తా పత్రికలు అదనం

పెందుర్తి: పిల్లలకు పుస్తకాలను నేస్తాలుగా మార్చాలి. మొబైల్ ఫోన్ స్థానంలో ఓ మంచి పుస్తకం అందుబాటులో ఉంచాలి. యూట్యూబ్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా పిల్లల మెదడుల్లో చేరుతున్న చెత్తను నియంత్రించాలంటే పుస్తక పఠనం అలవాటు చేయాలి. ఆసక్తిని రేకెత్తించాలి. అది జరగాలంటే అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను రోజూ సందర్శించేలా చేయాలి. ఈ మంచి పనికి వేసవి శిక్షణ శిబిరంలోనే అంకురార్పణ జరగాలి. అందులో భాగంగానే గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. వీటిని పిల్లలతోపాటు, పెద్దలూ వినియోగించుకోవాలని గ్రంథాలయ నిర్వాహకులు కోరుతున్నారు.

జూన్ 6 వరకు శిబిరాలు

పెందుర్తి శాఖా గ్రంథాలయంతో పాటు సబ్బవరం, సింహాచలం, పరవాడల్లోని గ్రంథాలయాల్లో జూన్ 6 వరకు(40రోజులు) వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగనున్నాయి. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ శిబిరాల్లో చిన్నారులకు నీతి కథలు బోధించడంతో పాటు క్విజ్, చిత్రలేఖనం, పుస్తక పఠనం తదితర అంశాల్లో తర్ఫీదు ఇవ్వనున్నారు. జనరల్ నాలెడ్జ్ (జీకే) పుస్తకాలు చదివించడంతో పాటు ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, నృత్యాలు, బొమ్మలు తయారు చేయడం వంటి అంశాలపై నిపుణుల్ని రప్పించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వేసవి శిబిరాలతో అనేక ప్రయోజనాలు

వేసవి శిక్షణ శిబిరాలకు పిల్లలను పంపడం వలన అనేక ఉపయోగాలు ఉన్నాయి. ముఖ్యంగా మొబైల్ ఫోన్లకు కొంతలో కొంత సమయమైనా పిల్లల్ని దూరంగా ఉంచవచ్చు. పుస్తక పఠనంపై ఆసక్తి కలిగేలా చేయడం వలన సహనం, ఏకాగ్రత, సామర్థ్యం, భాషపై పట్టు, ఉచ్చారణ వంటి అంశాలు మెరుగవుతాయి. ముఖ్యంగా ఒత్తిడి మాయం అవుతుంది. మరోవైపు పెద్దలకు కూడా పుస్తక పఠనం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మంచి రచనలు చదివి, వాటి నుంచి స్ఫూర్తి పొంది విజయాలు సాధించిన ఘనతలు ఎన్నో ఉన్నాయి. వైఫల్యాలను ఎదుర్కొని విజయం వైపు పయనించడానికి బుక్‌రీడింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎన్నో నిరూపణలు ఉన్నాయి.


పెందుర్తి శాఖా గ్రంథాలయం

అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు

పెందుర్తి శాఖ గ్రంథాలయంలో అన్ని రకాలకు చెందిన మొత్తం 8,071 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పిల్లలకు అవసరమైన పుస్తకాలు 2,583, రిఫరెన్స్ పుస్తకాలు 769, వివిధ తరగతుల పాఠ్యపుస్తకాలు 292, న్యూ లిటరేచర్ పుస్తకాలు 787, వార్షిక, మాస, వార పత్రికలు 22, ఫిక్షన్(నవలలు ఇతరత్రా) పుస్తకాలు 974, పోటీ పరీక్షలు, ఇతరత్రా పుస్తకాలు 2,544 అందులో ఉన్నాయి. దినపత్రికలు అన్నీ ఇక్కడ ఉంటాయి. గ్రంథాలయానికి రోజూ 80–90 మంది పాఠకులు వస్తుంటారు. ప్రస్తుతం వేసవి శిక్షణ శిబిరానికి 30 మంది పిల్లలు పేర్లు నమోదు చేసుకుని తర్ఫీదు పొందుతున్నారు.


శిక్షణలో బొమ్మలు గీస్తున్న చిన్నారులు

చిన్ననాటి నుంచి ఆసక్తి



నాకు చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం ఇష్టం. ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. ఇక్కడ అన్ని రకాల పుస్తకాలు ఉండడం మాలాంటి వాళ్లకు చాలా ఉపయోగకరం. ఉదయం పూట పిల్లల సందేహాలను నివృత్తి చేస్తుంటాను. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరానికి తల్లిదండ్రులు తమ పిల్లల్ని పంపితే వారు మంచి విషయాలు నేర్చుకుంటారు.

– ఆర్.రామకృష్ణ, పెందుర్తి

మొబైల్ స్థానంలో పుస్తకం ఉండాలి



ఎక్కడ చూసినా చిన్న పిల్లల చేతిలో మొబైల్‌లు ఉంటున్నాయి. దీని వలన వారికి కళ్ల సమస్యలతో పాటు మానసికం ఎదుగుదల కూడా తగ్గుతోంది. మొబైల్ గేమ్స్ పక్కన పెట్టి రోజులో అధిక సమయం పుస్తకాలు చదవడానికి, శారీరక దృఢత్వానికి ఆటలు ఆడేలా పిల్లలను ప్రేరేపించాలి. అందుకోసం వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.ముత్యాలనాయుడు, పెందుర్తి

పూర్తిస్థాయిలో ప్రోత్సాహం



40 రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరంలో పిల్లలకు బోర్ కొట్టకుండా ప్రతిరోజూ ఓ కొత్త అంశంపై శిక్షణ ఇస్తాం. వారిలో సృజనాత్మకత, మేధస్సుకు మరింత పదును పెట్టేలా ప్రయత్నిస్తున్నాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఇక్కడికి పంపేందుకు చొరవ చూపాలి. ప్రస్తుతం 30 మంది నమోదు చేసుకున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

– బి.సూర్యకళ, గ్రంథాలయాధికారి, పెందుర్తి

విరామ బైబిల్ పాఠశాల ప్రారంభం


బహుమతులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ

పరవాడ: గొర్లివానిపాలెం బసవతారకరామ కాలనీలో బాలల కోసం బుధవారం నుంచి మూడు రోజుల పాటు విరామ బైబిల్ పాఠశాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ ముఖ్య అతిథిగా పాల్గొని, బైబిల్ పాఠశాల లక్ష్యాన్ని పిల్లలకు వివరించారు. అనంతరం బాల బాలికలకు నిర్వహించిన కంఠస్థ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. నిర్వాహకులు బాలలకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు కుండా జాన్ వెస్లీ, వీబీఎస్ నిర్వాహకుడు పాల్ నగేష్, బాల బాలికలు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న బాలికల హాస్టల్ వార్డెన్ సుజాత

పరవాడ: చట్టాలు, పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పరవాడ బాలికల వసతి గృహం వార్డెన్ పి.సుజాత అన్నారు. ముత్యాలమ్మపాలెం శివారు సమ్మెంగిపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన చట్టాలు–పౌరహక్కులపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లపై అవగాహన కల్పించుకోవాలన్నారు. నాయుడుపాలెం గ్రామ రెవెన్యూ అధికారి అప్పారావు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా కలిసి ఉంటేనే పౌర హక్కులు అందరూ సమానంగా అనుభవించే వీలుంటుందన్నారు. దళితనాయకుడు కణితి చినసోమేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో కుల వివక్షతను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దళితులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తోటి వారు సహకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రతినిధులు ముత్యాలమ్మ, శివలంక అర్జున్‌రావు, సమ్మెంగి లోవరాజు, ఈరుగుల రవి, ఎస్.లక్ష్మి, వెంకటలక్ష్మి, గాంధీ, పరదేశి పాల్గొన్నారు.

కూటమి నేత అండతో అక్రమ నిర్మాణం


లేఅవుట్‌లో స్కూల్ జోన్ కోసం కేటాయించిన స్థలంలో చేపట్టిన నిర్మాణం



విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులు

- లేఅవుట్‌లోని స్కూల్, పార్క్ జోన్ స్థలంలో నిర్మాణం
- కోర్టు కేసు పెండింగ్‌లో ఉండగా.. అక్రమార్కుల బరితెగింపు
- మీడియాతో లేఅవుట్ ప్లాట్ల యజమానులు, స్థానికులు

పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెంలోని సుబ్రహ్మణ్యంనగర్–1 లేఅవుట్‌లో ఆక్రమణలకు గురవుతున్న స్కూల్ జోన్ స్థలాన్ని కాపాడాలని లేఅవుట్‌కు చెందిన కొల్లి వెంకటరమణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేఅవుట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లేఅవుట్‌లోని సర్వే నెం .337/1లో స్కూల్, పార్క్ జోన్ల కోసం కేటాయించిన స్థలాలను అడ్డగోలుగా విక్రయించడంతో, కొనుగోలుదారులు దర్జాగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారని ఆరోపించారు. దీనిపై జీవీఎంసీ, వుడా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించామన్నారు. 6 వారాల్లోగా ఆక్రమణలను తొలగించాలని హైకోర్టు 2022 నవంబర్ 22న ఉత్తర్వులు జారీ చేసినా, అధికారులు కనీస చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగా కూటమి నాయకుల అండదండలతో కొందరు అక్రమార్కులు స్కూల్ జోన్ స్థలంలో ఇంటి నిర్మాణానికి పూనుకోవడం దారుణమన్నారు. ఈ వ్యవహారంలో కూటమికి చెందిన రాష్ట్ర నాయకుడి అండదండలు పుష్కలంగా ఉండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టరు, జీవీఎంసీ, వుడా, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రాజకీయ ఒత్తిడులకు లొంగిన జీవీఎంసీ అధికారులు మొక్కుబడిగా జోన్ సచివాలయ సిబ్బందిని పంపించి చేతులు దులిపేసుకుంటున్నారని ఆరోపించారు. లేఅవుట్‌లో పాఠశాల నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గ్రామ మాజీ సర్పంచ్ అమరపిన్ని జోగినాయుడు, 79వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షుడు పిళ్లా శివకృష్ణ, వార్డు టీడీపీ అధ్యక్షుడు మచ్చ శివకుమార్, టీడీపీ యువత కార్యదర్శి కర్ణం అప్పారావు, జనసేన నాయకులు లక్కరాజు వాసు, సిటు నాయకులు వీవీ రమణ, కొల్లి రమాదేవి, శనివాడ ప్రకాష్, మోటూరి రామలక్ష్మి, వై.ఈశ్వరమ్మలు కోరారు.

హెచ్‌టీ లైన్ మార్పునకు స్థల పరిశీలన


దేశపాత్రునిపాలెంలో ఇళ్ల పైనుంచి వెళ్తున్న హైపవర్ విద్యుత్ వైర్లు

పరవాడ: జాజులవానిపాలెం నుంచి దేశపాత్రునిపాలెం చెక్‌పోస్టు వరకు ఏర్పాటు చేసిన హైటెన్షన్ (హెచ్‌టీ) విద్యుత్ లైన్‌ను మెయిన్ రోడ్డు మీదుగా మార్పు చేయాలని వార్డు ప్రజలు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు గతంలో విన్నవించారు. ఆయన ఆదేశాల మేరకు ఈపీడీసీఎల్ ఏఈ శేషసాయి విద్యుత్ లైన్‌ను బుధవారం పరిశీలించారు. జాజులవానిపాలెం నుంచి పవర్ గ్రిడ్ వరకు నిర్మించిన 33 కేవీ విద్యుత్ లైన్ వైర్లను ఇళ్ల పైనుంచి వేయడంతో గృహ యజమానులు చాన్నాళ్లుగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ హెచ్‌టీ విద్యుత్ లైన్ కారణంగా కొత్తగా ఇళ్ల నిర్మాణం సాధ్యపడట్లేదని వాపోతున్నారు. తమ ఇబ్బందుల్ని గుర్తించి పాత విద్యుత్ లైన్‌ను తొలగించి మెయిన్ రోడ్డు పక్క నుంచి విద్యుత్ లైన్‌ను మార్చేలా ఈపీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్ర పరిశీలన జరిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు పిళ్లా శివకృష్ణ, లక్కరాజు వాసు, ఎస్.జనార్దన్, మోహన్, మట్టపర్తి శ్రీనివాస్, శనివాడ ప్రకాష్ తదితరులున్నారు.

సీపీఐ మహాసభలు విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, సీపీఐ శ్రేణులు

పెందుర్తి: సీపీఐ విశాఖ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ నెల 10, 11 తేదీల్లో నగరంలోని మురళీనగర్‌లో మహాసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు జీవీఎంసీ 97వ వార్డు బర్మన్‌నగర్‌లో బుధవారం సీపీఐ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై పోరాటానికి మహాసభలో ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఎన్నికల హామీలు, సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూ సమస్యపై కూటమి ప్రభుత్వ హామీలపై పోరాటానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. సీపీఐ నాయకులు అసిరినాయుడు, రమణ, అన్నపూర్ణ, దుర్గారావు, అరుణ, పరుశురాం, అనురాధ, కార్యకర్తలు పాల్గొన్నారు.

చందన స్వామి భక్తులకు ‘స్వచ్ఛంద’ సేవ

తొలిసారిగా చిన్న లడ్డూ ప్రసాదం వితరణ

సింహాచలం: చందనోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపైన, కొండదిగువ పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు విశేష సేవలందించాయి. క్యూల్లోను, బస్టాండ్ ప్రాంగణంలో, దర్శనానంతరం ఆలయ దక్షిణ రాజగోపురం నుంచి వెలుపలకు వచ్చే మార్గంలో, కొండదిగువ పాత గోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్ తదితర ప్రాంతాల్లో భక్తులకి ఆహారపదార్థాలు, పానీయాలు, స్నాక్స్ అందించాయి.

- అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సింహగిరిపైన, కొండదిగువ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి, వైద్య సేవలు అందించారు.
- సింహగిరిపై అన్నప్రసాద భవనంలో నిర్విరామంగా దద్యోజనం, కదంబంను దేవస్థానం ప్రత్యేకంగా అందజేసింది.
- దర్శనానంతరం భక్తులు బయటకు వచ్చే దక్షిణ రాజగోపురం మార్గంలో దేవస్థానం తొలిసారిగా చిన్న లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేసింది.
- గోపాల్‌బాబు ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అరటి పండ్లు, సింహగిరి బస్టాండ్‌లో హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో పానకం అందజేశారు.


అన్నప్రసాద భవనంలో భక్తులకు పొంగలి, కదంబం అందిస్తున్న దేవస్థానం సిబ్బంది


భక్తులకు తొలిసారిగా దేవస్థానం తరఫున లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్న ఆంధ్రాబ్యాంకు సిబ్బంది


దక్షిణ రాజగోపురం మార్గంలో గోపాల్‌బాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో అరటిపండ్లు అందజేత


సింహగిరి బస్టాండ్‌లో పానకం అందజేస్తున్న హరేకృష్ణ మూమెంట్ సభ్యురాలు


సింహగిరిపై భక్తుడికి బీపీ చెక్ చేస్తున్న అడవివరం ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది

పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

సబ్బవరం: మండలంలోని లగిశెట్టిపాలెంలో కొలువైన పైడితల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిపారు. గ్రామ సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, వైఎస్సార్ పార్టీ జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఉండేలా, ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బోకం రామునాయుడు, ఆరిపాక మాజీ సర్పంచ్ పాలిశెట్టి పైడిరాజు, గొర్లి రాజేష్, మోపాడ అప్పారావు, సబ్బవరపు నారాయణమూర్తి, కాపుశెట్టి శేషుబాబు, బోకం బాలు, బయలపూడి రామారావు, శరగడం శంకరరావు, రాపేటి రాము, ఎస్పీ రాజు, మహలక్ష్మినాయుడు, మళ్ల కోటి, ఆడారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాసేపటి తర్వాత వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ హాజరై, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆయన వెంట యడ్ల నాయుడు, నేబర్తి శ్రీను, సిరపరపు వాసు తదితరులున్నారు.


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న గండి రవికుమార్ తదితరులు


అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఈదురు గాలులతో భారీ వర్షం


వాడచీపురుపల్లిలో కురుస్తున్న గాలివాన

పరవాడ: మండలంలో బుధవారం సాయంత్రం ఉరుములు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాతావరణం ఒక్క సారిగా చల్లబడడంతో జనం ఎండ వేడిమి నుంచి కొంత ఉపశమనం పొందారు. గంట పాటు కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల అరటి తోటలకు నష్టం వాటిల్లింది. ఈ వర్షం పశువులకు అవసరమైన పశుగ్రాసం పెరిగేందుకు దోహద పడుతుందని పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.